నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంతో పాటు అన్ని మండలకేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్‌స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తు ఏదశలో ఉందో తెలుసుకోవడం కోసం కాల్‌సెంటర్ నెంబర్ 1100కు ఫోన్‌చేసి తెలుసుకో వచ్చన్నారు.

బాలికల విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది.. విద్యార్థినుల సంక్షేమానికి నిధులు విడుదల చేస్తున్నా క్షేత్రస్థాయిలో అంతంత మాత్రమే అమలు అవుతోంది. విద్యార్థినుల కనీస అవసరాలు కూడా తీర్చలేకపోతున్నారు. ఎప్పుడో పాఠశాలలు ప్రారంభించినప్పుడు ఇచ్చిన బెడ్‌షీట్లే వాడాల్సిన దుస్థితి నెలకొంది. ఏళ్లకు ఏళ్లుగా వాటిని వినియోగిస్తుండటంతో అవి పూర్తిగా పాడైపోయాయి. దీంతో చాలా మంది విద్యార్థినులు ఇళ్ల నుంచి బెడ్‌షీట్లు తెచ్చుకుంటున్నారు. ఇటీవలే ప్రభుత్వం హాస్టళ్లకి అవసరమైన వంట సామగ్రి, వస్తువులను సరఫరా చేసింది. అయితే బెడ్‌షీట్లు ఇవ్వడం మాత్రం మరిచారు. గతంలో కాస్మెటిక్ చార్జీలను ఇచ్చేవారు. వాటికి కూడా ప్రస్తుతం మంగళం పాడారు.



దుప్పట్లు ఏవీ..?

- కేజీబీవీ, మోడల్ స్కూళ్ల హాస్టళ్లలో అందని బెడ్‌షీట్లు
- ఇంటి నుంచి తెచ్చుకుంటున్న విద్యార్థినులు
- కాస్మెటిక్ చార్జీలకు మంగళం
- తల్లిదండ్రులపై అదనపు భారం

ఆలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బాలికల విద్యకు ప్రోత్సహిస్తున్నా వారికి అందాల్సిన సంక్షేమం మాత్రం అందడం లేదు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ), మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్ విద్యార్థినులు దుప్పట్లు లేక అవస్థలు పడుతున్నారు. ఎప్పుడో ఈ స్కూళ్ల ప్రారంభించిన కాలంలో ఇచ్చిన బెడ్‌షీట్లు ఇంకా వాడుతున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం దుప్పట్లు సరఫరా కాలేదు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, గురుకులం వంటి సంక్షేమ హాస్టళ్లకు ప్రతియేటా బెడ్ సీట్లను ప్రభుత్వం సరఫరా చేస్తున్నా ఈ రెండు బాలికల హాస్టళ్లకు మాత్రం సరఫరా చేయలేదు. దీంతో విద్యార్థినులు ఇళ్ల నుంచే బెడ్‌షీట్లు తెచ్చుకుంటున్నారు. ఇటీవలే హాస్టళ్లకి అవసరమైన వంట సామగ్రి, వస్తువులను సరఫరా చేసింది. అయితే విద్యార్థినులకు అవసరమైన వాటిని మాత్రం సరఫరా చేయడం మరిచింది. జిల్లాలో 26 కేజీబీవీ బాలికల విద్యాలయలు ఉండగా 7075 మంది విద్యార్థినులు, మోడల్ స్కూల్ (కేజీబీవీ టైప్-4) బాలికల హాస్టళ్లు 16 ఉండగా అందులో 1416 మంది విద్యార్థినులు వసతి పొందుతున్నారు.



ఆరేళ్లుగా నిలిపివేశారు..

గతంలో కేజీబీవీ, మోడల్ హాస్టల్స్ విద్యార్థినులకు ప్రతినెలా కాస్మెటిక్ చార్జీల కోసం ఒక్కో విద్యార్థికి రూ.100 చొప్పున మంజూరు చేసేది. వాటిలో స్నానం సబ్బులు, బట్టల సబ్బులు, కొబ్బరినూనె, స్నే ప్రీ, టూత్ పేస్ట్, ఫేస్ పౌడర్, కలిపి మొత్తం ఆరు రకాల వస్తువులు సరఫరా చేసేవారు. వాటిని కూడా ఆరేళ్లుగా నిలిపివేయడంతో ప్రతినెలా తల్లిదండ్రులపై భారం పడుతుంది. కూటమి ప్రభుత్వంలోనైనా విద్యార్థినులకు అవసరమైన బెడ్ షీట్లు, కాస్మెటిక్ చార్జీలు మంజూరయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రుల కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ హాస్టళ్లకి త్వరలోనే బెడ్స్ పంపిణీ చేస్తాం. ఇక బెడ్ షీట్లు, కాస్మెటిక్ చార్జీల విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

● స్నేహలత, జీసీడీవో సమగ్రశిక్ష, కర్నూలు

మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించాలి..



ప్రభుత్వం ప్రతియేటా ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు బెడ్ షీట్లు సరఫరా చేస్తున్నా కేజీబీవీ, మోడల్ గర్ల్స్ హాస్టళ్ల విద్యార్థినులకు మాత్రం సరఫరా చేయడం లేదు. కాస్మోటిక్ చార్జీలకు మంగళం పలకడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడుతుంది. మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించి విద్యార్థులకు బెడ్‌షీట్లు, కాస్మోటిక్ చార్జీలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి.

● మునిస్వామి, పీడీఎస్‌యూ తాలూకా కార్యదర్శి, ఆలూరు

ఉరుకుంద ఆలయ డీసీగా వాణి



కౌతాళం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయపు డిప్యూటీ కమిషనర్‌గా ఆదివారం కె.వాణి బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆలయ కార్యాలయంలో డీసీ విజయరాజు నుంచి పదవి బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇదే దేవాలయానికి వాణి అసిస్టెంట్ కమిషనర్ హోదాలో విధులు నిర్వర్తించారు. ఇక్కడ పని చేస్తున్న డీసీ విజయరాజు అనంతపురం జిల్లా కసాపురం ఆంజనేయ స్వామి దేవాలయానికి బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న వాణిని ఉరుకుందకు బదిలీ కావడంతో ఆమె ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి మరింత పాటుపడుతానని తెలిపారు.

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు

● భక్తులతో కిటకిటలాడిన ఉరుకుంద క్షేత్రం



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి ఆదివారం నుంచే భక్తులు భారీ గా తరలి వస్తున్నారు. ముఖ్యంగా శ్రావణ మాసంలో మూడో సోమ వారం స్వామి దర్శనానికి ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుం చి భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే వివిధ వాహనాల్లో భక్తులు కుటుంబ సమేతంగా తరలి వస్తున్నారు. మూడో సోమవారం ఒక్కరోజు దాదాపు రూ.2 నుంచి రూ.3 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారన్న అంచనా ఉండడంతో ఆలయ అధికారులు భక్తులకు తగిన సౌకర్యాలను కల్పించ డంలో నిమగ్నమయ్యారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. మరి కొంత మంది భక్తులు స్వామి సన్నిధిలోనే నైవేద్యాలను తయారు చేసి స్వామి వారి సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కౌతాళం సీఐ అశోక్ కుమార్ పటిష్ట బందోబస్తు చేపడుతున్నారు.

నేటి నుంచి ఎఫ్‌ఏ-1 పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు ఫార్మెటివ్ అసెస్మెంట్(ఎఫ్ఏ)-1 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరీక్షల విభాగం సెక్రటరీ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు 1 నుంచి 5తరగతుల విద్యార్థులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.45 గంటల వరకు, మధ్యాహ్నం 1.15 నుంచి 2.30 గంటల వరకు, 6 నుంచి 10వ తరగతి వరకు ఉదయం 9.30 నుంచి 10.45 గంటల వరకు, 11 గంటల నుంచి 12.15 వరకు, మధ్యాహ్నం 1.15 నుంచి 2.30 గంటల వరకు, 2.45 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పరీక్షలు కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలకు ప్రైవేటు పాఠశాలల నుంచి ఆరో తరగతి విద్యార్థులు 15,817 మంది, ఏడో తరగతి విద్యార్థులు 15,283 మంది, ఎనిమిదో తరగతి విద్యార్థులు 11,594 మంది, తొమ్మిదో తరగతి విద్యార్థులు 11,410 మంది, పదో తరగతి విద్యార్థులు 10,289 మంది మొత్తం కలిపి 64,393 మంది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు 1,16,915 మంది, 6 నుంచి నుంచి 10వ తరగతి విద్యార్థులు 1,58,094 మంది కాగా, మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 2,75,009 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.



దర్శనానికి వెళ్తున్న భక్తులు

భక్తులతో మల్లన్న క్షేత్రం కిటకిట

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో శ్రీశైల క్షేత్రం కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆ తర్వాత స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం తాగునీరు, అల్పాహారం అందించారు.

ప్రజల కోసం పనిచేద్దాం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

7



చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలి: కలెక్టర్

ఓర్వకల్లు, ఆగస్టు 10 ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో విద్యార్థులు ఎక్కడ స్థిరపడినా తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి కృషి చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. ఆదివారం ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆకర్ష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్‌తో పాటు రాష్ట్ర గురుకుల విద్యార్థుల సెక్రటరీ మస్తాన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గురుకుల పాఠశాలలో 1993 నుంచి 1999 బ్యాచ్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆకర్ష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, క్రికెట్, అథ్లెటిక్స్ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు ట్రోఫీలు బహూకరించారు. పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అప్పటి సమయంలో పాఠశాలలో ప్రహరీ ఉండేది కాదని, తాను పంచాయతీ రాజ్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో రూ.50లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మించారన్నారు. గ్రీన్‌కో కంపెనీ ఆధ్వర్యంలో జగ్నాథగట్టు వద్ద క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో పీ-4 పాలసీ కింద గుర్తించిన బంగారు కుటుంబాలను కూడా దత్తత ప్రక్రియ దాదాపు పూర్తయిందన్నారు. బనవాసి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్నెల్ రోడ్డు మరమ్మతులు పనులు కూడా చేస్తున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన సందర్భంగా తన సహ విద్యార్థులు, టీచర్లు, ఉపాధ్యాయులతో సమావేశమై అప్పటి జ్ఞాపకాలను, అనుభవాలను కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో గదులను సందర్శించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్‌పాల్, తహసీల్దార్ విద్యాసాగర్, ఏపీఆర్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆకర్ష్ బుక్‌లెట్లను విడుదల చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

జయహో రాఘవేంద్రా.. విజయహో..

- భక్తుల నినాదాలతో మార్మోగిన మంత్రాలయం
- వైభవంగా పూర్వారాధన
- స్వర్ణపల్లకిలో విహరించిన రాఘవరాయలు
- సింహవాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు
- కంచి, శ్రీరంగం క్షేత్రాల నుంచి పట్టువస్త్రాల సమర్పణ



బంగారు పల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్రుడు



మంత్రాలయం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జయహో గురు రాఘవేంద్రా.. విజయహో అంటూ దేశ నలుమూలల నుంచి అశేష భక్తజనవాహిని తరలివచ్చి మంత్రాలయంలో తరించారు. రాఘవేంద్రస్వామి 354వ ఆరాధనోత్సవాల్లో ముఖ్యమైన పూర్వారాధన మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు సింహవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి బృందావనాన్ని ప్రహ్లాదరాయల రూపంలో అలంకరణ చేసిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బంగారు పల్లకిపై రాఘవేంద్రులను ఘనంగా ఊరేగించగా.. ఈ దృశ్యాలను చూసి భక్తులు ఆనందపరవశంతో తరించారు. తమిళనాడులోని శ్రీరంగంలోని రంగనాథస్వామి దేవస్థానం నుంచి, కంచి మఠం నుంచి ప్రధాన అర్చకులు అధికారికంగా స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. వీరికి శ్రీమఠం అధికారులు మహాముఖద్వారం నుంచి ఊరేగింపుతో తీసుకువచ్చి మూల బృందావనం ముందు ఉంచి పూజలు చేసి అనంతరం పీఠాధిపతిని సన్మానించారు. సింహవాహనుడైన ప్రహ్లాదరాయలను చెక్క పల్లకిలో ఊరేగించిన అనంతరం ఊంజల సేవ చేసి పీఠాధిపతి హారతులు ఇచ్చారు. వజ్ర వైడూర్య అలంకృతుడైన ప్రహ్లాద రాయలను చెక్క వెండి గజ, బంగారు నవరత్నాలపై స్వామివారిని అధిష్ఠించి పీఠాధిపతి మహామంగళ హారతులు ఇవ్వగా రథాలు ముందుకు కదిలాయి. జయహో గురు రాఘవేంద్ర.. విజయహో.. తుంగా తీరనివాసా గోవిందా.. గోవిందా అంటూ భక్తులు పెద్ద ఎత్తున జయధ్వానాలతో రథోత్సవంలో పాల్గొన్నారు. సింహాకృతుడైన ప్రహ్లాద రాయలు వెండి ఊయలలో ఊంజల సేవ చేస్తుండగా.. పీఠాధిపతి స్వహస్తాలతో హారతులు ఇస్తుండగా.. భక్తులు కనులారా తిలకించి మంత్రముగ్ధులయ్యారు.

మిగతా 6వ పేజీలో



శ్రీరంగం నుంచి పట్టువస్త్రాలు తెస్తున్న ప్రధాన అర్చకులు

జయహో రాఘవేంద్రా.. విజయహో..



మూలరాములకు పూజలు చేస్తున్న పీఠాధిపతి

5వ పేజీ తరువాయి

భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో మంత్రాలయం మఠం ప్రాంగణం, మధ్వమార్గ్ కారిడార్ ప్రధాన రహదారులు భక్తులతో మార్మోగాయి. అంతకుముందు పూర్ణబోధ పూజా మందిరంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. అనంతరం శ్రీరంగం, కంచి మఠాల ప్రధాన అర్చకులకు పీఠాధిపతులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత విధ్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ప్రత్యేక అధికారులు కృష్ణ కౌశిక్, శ్రీశ్వాజోయిష్, రాజా ఎస్.అప్రమేయాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్ అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, పూజారి వ్యాస రాజాచార్, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, రవి కులకర్ణి, విజయేంద్రాచార్, జయతీర్థాచార్, ఏతః బద్రినాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, డీఎం ఆనందరావు, జేపీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

దర్శించుకున్న ప్రముఖులు

ఈఉత్సవాల్లో ముఖ్యఅతిథులుగా కర్ణాటక హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ శ్రీషానంద, జస్టిస్ టీఎం నదాఫ్, కర్ణాటక ఇరిగేషన్ శాఖ మంత్రి బోసెరాజు రాఘవేంద్రస్వామిని దర్శించుకోగా.. పీఠాధిపతి శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ఆకట్టుకున్న భరతనాట్యం

పూర్వాధనలో భాగంగా యోగీంద్ర కళా మండపంలో రాయచూరు చెందిన మంగళ హారం, సన్నిధి నృత్య రూపకంలో భాగంగా కర్ణాటక కళా మండపం చెందిన రంజిత్, భార్గవి కూతురు మంగు సుమజ్ఞ, నిర్వహించిన భరతనాట్యం ఆకట్టుకుంది. రేస్ కాన్సెప్ట్ పాఠశాల నుంచి విద్యార్థులు, భరతనాట్య కళాకారులు చేసిన నృత్యరూపకం కనువిందు చేసింది. వీరికి మెచ్చి పీఠాధిపతి నగదు శేషవస్త్రం ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కర్ణాటక కళా మండల అధినేత మంజునాథ గోరుకల్లుకు పీఠాధిపతి అభినందించి సత్కరించారు.

ఉత్సవాల్లో నేడు..

రాఘవేంద్రస్వామి 354వ ఉత్సవాల్లో అత్యంత ప్రాముఖ్య దినమైన మధ్యారాధన మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. తెల్లవారుజాము 4 గంటల నుంచి 5గంటల వరకు బృందా వనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, అనం తరం 5 నుంచి 6 గంటల వరకు 500 లీటర్లతో క్షీరాభిషేకం, ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు ప్రహ్లాదరాయులకు పాదపూజ, ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విశేష పం చామృతాభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 బంగారు స్వర్ణ రథంపై రాఘవేంద్రుల రథోత్సవం, 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పీఠాధిపతుల సంస్థాన పూజ, 12.30 నుంచి 1.30 గంటల వరకు అలంకరణ సంతార్పణ, హస్తోదకం, 1.30 గంటల నుంచి 2.30గంటల వరకు మహా మంగళహారతి, తీర్థప్రసా దాల వితరణ ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు జ్ఞాన యజ్ఞం, రాత్రి 8.30 గంటలకు గజ, రజిత, స్వర్ణ రథోత్సవాల ఊరేగింపు, అనం తరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న అశేష భక్తజనం



సింహ వాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు

ప్రముఖులకు రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులు ప్రధానం

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ఉత్సవాల్లో మూడో రోజు యోగీంద్ర కళామండపంలో ఆదివారం రాత్రి ప్రముఖులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్ర అనుగ్రహప్రశస్తి అవార్డులను ప్రదానం చేశారు. వారణాసికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త రాజారాం శుక్లా కోయంబత్తూరు చెందని పారిశ్రామికవేత్త పీఆర్ విఠల్‌కు అవార్డులను ప్రదానం చేసి వెండి తట్ట, మెమెంటో, నగదు ఇచ్చి సత్కరించారు. అలాగే విధ్వాన్ పండిత కేసరి రాజాఎస్ గిరిరాజాచార్, గౌహతి హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ శ్రీధర్‌రావు, మఠం ఏఏవో, దేవదాయశాఖ రిటైర్డు రీజనల్ జాయింట్ కమిషనర్ ఎల్.మాధవశెట్టికి వెండి తట్ట, మెమెంటో, నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్, మంత్రాలయం మేనేజర్ నాగార్జున, ఎస్కే శ్రీనివాసరావు, అబోడే హోటల్ మేనేజర్ రజనీకాంత్ పాల్గొన్నారు.



రాఘవేంద్ర అనుగ్రహ అవార్డును కాశీకి చెందిన రాజారామ్ శుక్లాకు అందజేస్తున్న పీఠాధిపతి



కోయంబత్తూరు పీఆర్ విఠల్‌కు అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి

పుష్కరిణితో మంత్రాలయానికి మరింత గుర్తింపు

● శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



పుష్కరిణీ గురించి కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీషానంద, కర్ణాటక మంత్రి బోసే రాజుకు వివరిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రుని సన్నిధిలో పుష్కరిణీ నిర్మించడం మంత్రాలయానికి మరింత గుర్తింపు వచ్చిందని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. ఆదివారం కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీషానంద, కర్ణాటక చిన్ననీటి పారుదల శాఖ మంత్రి బోసెరాజు, కంచి ప్రధాన అర్చకుడు శ్రీరంగం ప్రధాన అర్చకులతో కలిసి రూ.3.50 కోట్లతో బెంగళూరుకు చెందిన ప్రకాష్ శెట్టి నిర్మించిన పుష్కరిణీ గురించి పీఠాధిపతి వారికి వివరించారు. చుట్టూ అందమైన ప్రాకారం, పుష్కరిణి మధ్యలో రాతిశిలా మండపం, తెప్పోత్సవంలో స్వామి వారిని ఊరేగించేందుకు తెప్పోత్సవం గురించి వారికి వివరించారు. అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాముఖ్యమైన దినాల్లో మాత్రమే ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు తెప్పోత్సవంపై విహరిస్తున్నారని, రానున్న రోజుల్లో తెప్పోత్సవంపై ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. భక్తుల సౌకర్యార్థం కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి భక్తులు ముందుకు వస్తున్నారని, భక్తుల సాకారంతో భక్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, సూరేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, సుజయీంద్రాచార్, బద్రినాథ్ ఆచార్, ఏతః బద్రీనాథ్, హరిదాస్, ప్రకాషాచార్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో గెస్టుహౌస్‌ను పునర్నిర్మిస్తాం



మాట్లాడుతున్న కర్ణాటక మంత్రి బోసెరాజు

మంత్రాలయం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే కర్ణాటక భక్తులకు గెస్టుహౌస్ కల్యాణ మండపాన్ని పునర్నిర్మిస్తామని కర్ణాటక నీటి పారుదల శాఖ మంత్రి బోసెరాజు అన్నారు. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థం ఆయన మంత్రాలయానికి వచ్చారు. ఆయనకు శ్రీమఠం అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మంత్రాలయంలోనే కాకుండా శ్రీశైలానికి వచ్చే భక్తులకు గతంలో ఉన్న టూరిజం స్థలం లీజు పూర్తయినందు వల్ల స్థల పరిశీలన కోసం అధికారులకు అధికారికంగా లేఖ రాస్తున్నామని, ఇందుకు అవసరమైన రూ.92 కోట్లు కర్ణాటక ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. మంత్రాలయం మఠం రోజురోజుకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అభివృద్ధి పనులతో పాటు పరిమళ పుష్కరిణి నిర్మించడం అద్భుతంగా ఉందన్నారు. శ్రీమఠానికి అవసరమైన సహాయ సహకారాలు కర్ణాటక ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా చేయూతనందిస్తామన్నారు. రవాణా వసతులు, రోడ్లు అన్ని రకాల సహకారం ఉంటుందన్నారు. మంత్రాలయంలో కర్ణాటక టూరిజం ఆధ్వర్యంలో నిర్మించిన భవనాలు పాతబడటంతో వాటిని తొలగించి కొత్త భవనాలు నిర్మాణానికి ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో కర్ణాటక శ్రీమఠం అసిస్టెంట్ ఇంజనీర్ ఇడపనూరు సంజీవ కులకర్ణి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

తెర స్మరణీయ నాటక రచయిత 'పల్లేటి లక్ష్మీకులశేఖర్'

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య



ప్రముఖ నాటక రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్‌కు నివాళులు అర్పిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగతంగా 12 నంది అవార్డులు, నాటక రచనల ద్వారా నటులకు 86 నంది అవార్డులు తెచ్చిపెట్టిన తెర స్మరణీయ నాటక రంగ రచయిత దివంగత పల్లేటి లక్ష్మీకులశేఖర్ అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య కొనియాడారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రముఖ సాంఘిక, పద్య నాటక రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్ ప్రథమ వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో కులశేఖర్ చిత్రపటానికి పూల దండలు వేసి కవులు, నాటక రంగ కళాకారులు నివాళులర్పించారు. సభకు అధ్యక్షత వహించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఆధునిక తెలుగు పద్య నాటక రంగాన్ని ముందుకు తీసుకుపోయిన ఘనత పల్లేటి లక్ష్మీకులశేఖర్‌కు దక్కుతుందని, ఆయన పద్య నాటకాలే రాష్ట్ర వ్యాప్తంగా వందలాది ప్రదర్శనలు అందుకొని ఆయనతోపాటూ కర్నూలు కళారంగానికి కీర్తిప్రతిష్టను తెచ్చిపెట్టాయని గుర్తు చేశారు. టీజీవీ కళాక్షేత్రానికై ఆయన ప్రత్యేకంగా రాసిన నాటకాల ద్వారా 35 నంది అవార్డులు వచ్చాయని, ఆయన కళాక్షేత్రం ఆస్థాన రచయితగా రాణించారని గుర్తుచేశారు. పల్లేటి లక్ష్మీకులశేఖర్ అకాల మరణం నాటక రంగానికి తీరని లోటని శ్లాఘించారు. ఈ సభలో కళాక్షేత్రం కార్యదర్శి సి. యాగంటీశ్వరప్ప, కళాకారులు జీవీ శ్రీనివాసరెడ్డి, పి. రాజారత్నం, గాండ్ల లక్ష్మన్న, కదిరి రమేష్, కేవీ రమణ, పీపీ గురుమూర్తి, లక్ష్మీకాంతరావు, క్రిష్టఫర్, మద్దయ్య, సి. నవీన్‌కుమార్ చౌదరి, శామ్యూల్, హార్మోనిస్టు గురువు బలరాముడు తదితరులు పాల్గొన్నారు. రక్షాబంధన్ వేడుకలో భాగంగా అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తు చేసే 'రక్తసంబంధం' తెలుగు చలనచిత్రాన్ని కళాక్షేత్రంలో ప్రదర్శించారు. అలనాటి తెలుగు చిత్ర కథానాయకుడు ఎన్టీ రామారావు, సావిత్రి, దేవిక, కాంతారావు తదితరులు నటించిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆసక్తిగా వీక్షించారు.

ప్రజల కోసం పనిచేద్దాం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు




మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పనిచేద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. నగరంలోని పున్నమి ఫంక్షన్ హాలులో ఆదివారం రెండు రోజుల పాటు జరుగుతున్న సీపీఐ 24న జిల్లా మహాసభలలో రెండో రోజు ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్, విరూపాక్షి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణి అధ్యక్షత వర్గంగా ఉన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య హాజరయ్యారు. రామకృష్ణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఒకలా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో నిత్యం కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువజనులు, శ్రామికులు, మహిళల పక్షాన నిలిచి వారి వాణి వినిపిస్తున్నందునే వారు మన వైపు ఉన్నారన్నారు. పేరుకే కూటమి ప్రభుత్వమైనా మన రాష్ట్రంలో నరేంద్రమోదీ, అమిత్‌షా, ఆర్ఎస్ఎస్ అజెండాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. సెప్టెంబరు 21 నుంచి 25 వరకు చండీఘర్‌లో జరిగే సీపీఐ జాతీయ మహాసభల అనంతరం ఉద్యమాలకు సిద్ధమవుతామన్నారు. ఒంగోలులో ఆగస్టు 23నుంచి 25వరకు రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర పరిణామాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతిపక్షంలో చంద్రబాబు విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణను వ్యతిరేకించారని, ఆతర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించినా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచేది లేదని చెప్పి నేడు రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపారని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్లు వద్దని చెప్పి వాటిని బిగిస్తున్నారని అన్నారు. ఆర్టీసీ, నీటి జలాలు కూడా ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎటువంటి ఉపయోగం లేని బనకచర్ల ప్రాజెక్టుకు రూ.82వేల కోట్లు ఖర్చు చేయాలని చూస్తున్నారని, జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే సరిపోతుందన్నారు. 2029నాటికి పేదరికం లేని రాష్ట్రంగా మారుస్తానని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేసి హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేసి, పరిశ్రమలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం దాసరి నాగభూషణం నీతి నిజాయితీ నిస్వార్థపరుడు అని కొనియాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ఆవుల శేఖర్, ఎస్.లెనిన్‌బాబు, జిల్లాకార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా గిడ్డయ్య

● వరుసగా మూడోసారి ఎన్నిక

● సహాయ కార్యదర్శులుగా లెనిన్‌బాబు, మునెప్ప



బి.గిడ్డయ్య

సీపీఐ జిల్లా కార్యదర్శిగా బి.గిడ్డయ్య ఎంపికయ్యారు. వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా నక్కి లెనిన్ బాబు, మునెప్ప, కార్యవర్గ సభ్యులుగా జగన్నాథం, నబీ రసూల్, మద్దిలేటి శెట్టి, రాజాసాహెబ్, రామకృష్ణారెడ్డి, లలితమ్మ, శ్రావణిరెడ్డి, పంపన్నగౌడు, భాస్కర్ యాదవ్, జి.చంద్రశేఖర్, రంగన్న, విరుపాక్షి, కారుమంచి సుదర్శనం, కె.శ్రీనివాసులు, బి.రా జు, 65 మంది జిల్లా సమితి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ 24వ జిల్లా మహాసభలు రెండు రోజులుగా స్థానిక ఏపీ టూరిజం ఫంక్షన్ హాలులో జరిగాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్య దర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ముఖ్యఅతిథు లుగా హాజరయ్యారు. మహాసభలో భాగంగా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా కార్యదర్శి కోసం లెనిన్‌బాబు, మునెప్పలు సైతం పోటీ పడ్డారు. అయితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



సుదర్శన్(ఫైల్)

తుగ్గలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఏటా సాగు చేసిన పంటలు అప్పులే మిగిలిస్తుండటంతో పొలంలోనే పురుగుల మందు తాగి యువ రైతు సుదర్శన్ (30) ఆత్మహత్య చేసుకున్నారు. మండలంలోని కడమకుంట్ల చెందిన యువ రైతు సుదర్శన్ పొలంలో పురుగు మందు తాగడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. రైతు తనకున్న నాలుగెకరాల పొలంతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ, కంది, టమోటా, మిరప పంటలు సాగు చేశాడు. పంటల సాగుకు చేసిన అప్పులు ఏటేటా పెరుగుతూ రూ.10 లక్షలకు చేరడంతో అప్పులు ఎలా తీర్చాలో అర్థం గాక అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఫక్కీరప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ..



వడ్డె మధు (ఫైల్)

ఓర్వకల్లు, ఆగస్టు 10 ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక కుటుంబాన్ని పోషించలేక ఓ కౌలు రైతు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మండలంలోని గుట్టపాడు గ్రామానికి చెందిన కౌలురైతు వడ్డె మధు (36) శుక్రవారం తన ఇంట్లో ఉన్న పురుగుమందును తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక మృతి చెందాడు. మృతుడు ఐదెకరాల పొలంలో ఐదేళ్లుగా పంటలు పండక, గిట్టుబాటు ధర లేక రూ.8 లక్షల దాకా అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది పురుగు మందు తాగాడు. పత్తి, మొక్కజొన్న వివిధ పంటలు సాగు చేశాడు. మృతుడికి భార్య మౌనిక, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

కోవెలకుంట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన పట్టణంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని ఎల్.ఎం.కాంపౌండ్‌కు చెందిన అశోక్(40) ఆర్టీసీ బస్టాండులో బస్సులను శుభ్రం చేస్తూ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకన్నాడు. ఆదివారం తెల్లవారుజామున భార్య శ్యామల లేచి చూడగా భర్త ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని విషయం తెలుసుకుని బంధువులకు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. అశోక్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణలో ఒకరి మృతి

- త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మృతుల బంధువుల ఆందోళన



లక్ష్మన్న (ఫైల్)

ఆదోని, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అరుణ్‌జ్యోతి నగర్‌లో జరిగిన ఇరువర్గాల మధ్య ఘర్షణలో ఒకరు మృతిచెందారు. న్యాయం చేయాలంటూ మృతుడి బంధువులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. సీఐ రామలింగమయ్య, మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.... అరుణ్‌జ్యోతినగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసులు, వీరేష్ కుటుం బాలు పక్కపక్కన నివాసం ఉంటున్నారు. రహదారి విషయంలో గతంలో ఈ రెండు కుటుంబాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇటీవల వర్షాలు అధికంగా కురుస్తుండడంతో వీరేష్ నీళ్లు ఉన్న కారణంగా ఆయన కుమారుడు గిరిబాబు మిద్దె పైకెక్కి నీటిని కిందికి తోడేసేందుకు పనిలో నిమగ్నమయ్యాడు. దీన్ని గమనించిన వీరేష్ కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపి, తమ ఇంటి ముందు నీళ్లు పడుతున్నాయంటూ ఒకరినొకరు దూషించుకుంటుండగా గిరిబాబు చిన్నాన్న లక్ష్మన్న(50) అక్కడ చేరుకొని వీరేష్ కుటుంబ సభ్యులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. వీరి మధ్య సఖ్యత కుదరకపోవడంతో ఒకరిపైపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో లక్ష్మన్నకు గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో స్థానిక ఆదోనిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ కూడా పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో అంబులెన్స్ సాయంతో కర్నూలుకు బయలుదేరారు. కర్నూలుకు వెళ్తుండగా ఎమ్మిగనూరు సమీపంలో లక్ష్మన్న తుది శ్వాస విడిచినట్లు అంబులెన్స్‌లోని వైద్యులు గుర్తించారు. దీంతో మృతదేహాన్ని ఆదోనికి తీసుకొచ్చి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద మృతుడి బంధువుల న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. త్రీటౌన్ సీఐ రామలింగమయ్య, వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ ఇద్దరు కూడా మృతుడి బంధువులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. గంటపాటు ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు పోలీసులు ఇచ్చిన హామీలతో ఆందోళన విరమించి పోస్టుమార్టం నిమిత్తం లక్ష్మన్న మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని సీఐ రామలింగమయ్య తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన మృతుడి బంధువులు

సమస్యల పరిష్కారమే ఐఎన్‌టీయూసీ లక్ష్యం


మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకుడు బతుకన్న

కర్నూలురూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ పని చేస్తుందని జిల్లా అధ్యక్షుడు బి. బతుకన్న అన్నారు. ఆదివారం నగరంలోని రైల్వే గూడ్ షెడ్‌లో ఐఎన్‌టీయూఈసీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. కార్మికుల సమస్యలు, హక్కులు, సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ హమాలీలంతా ఐక్యమత్యంతో ఉండి, స్వయంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఇతరుల అనవసర జోక్యాన్ని నివారించాలని కోరారు. రైల్వే అధికారులతో మంచి సంబంధాలు కొనసాగించాలని, కాంట్రాక్టర్లతో సమన్వయంతో పని చేయాలని, వాగన్లకు డిటెన్షన్ ఛార్జీలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

బాలికపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా కారంచేడు మండలంలో రజక బాలికపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలికను అసభ్యకరంగా దూషించడంతో పాటు కర్రలతో కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రక్షించాల్సిన పోలీసులు ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. సమావేశంలో అధ్యక్షుడు ముక్కన్న, నాయకులు శేషాద్రి, శ్రీనివాసులు, రాముడు, పర్ల సుంకన్న, డా.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● ఈ నెల 13న జరిగే ట్రాక్టర్, స్కూటర్ ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామక్రిష్ణ పిలుపునిచ్చారు. కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని సుందరయ్య భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ఎస్‌కేఎం పిలుపుమేరకు జరిగే ట్రాక్టర్, స్కూటర్ ర్యాలీని విజయవంతం చేసేందుకు కార్మికులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు రాముడు, రాజశేఖర్, సాయబాబ, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అధికారులపై కమిషనర్ ఆగ్రహం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో పని చేస్తున్న ఇంజనీరింగ్ అధికారులపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పాలక పరిధిలో వీధిలైట్ల మరమ్మతులు, నూతనంగా ఏర్పాటు చేయాల్సిన వీధి లైట్లపై కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులకు యూవో నోట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో పాణ్యం ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివారు కాలనీల్లో కావాల్సిన వీధిలైట్లు, మరమ్మతులకు సంబంధించి త్వరితగతిన లైట్లను కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. అమ్యూనిటీస్ కార్యదర్శులు సచివాలయాల వారిగా వీధి లైట్లు ఎన్ని కావాలి...ఎక్కడ మరమ్మతులు చేయాలో క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను పరిష్కరించాలన్నారు. వాహనాలకు జీపీఎస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి ఎస్‌ఈని ఆదేశించారు.

నేడు నగర పాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీలో ఏవైనా స్థానిక సమస్యలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

కార్మికుల పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న రాధాకృష్ణ

కల్లూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గ పోరాటలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పిఎస్.రాధాకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. ఆదివారం కల్లూరు మండలం దూపాడులో ఏ.ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన మండల సీఐటీయూ రెండవ మహాసభలో ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సమ్మెను నిర్వహించిందన్నారు. కార్మికులకు రాజకీయ చైతన్యం అవసరమన్నారు. అనంతరం 15 మందితో సిఐటీయూ మండల కమిటీ ఏర్పాటి ఏర్పాటు చేశారు. కల్లూరు మండలం కన్వీనర్‌గా కె.మధు, కో-కన్వీనర్‌గా బి.చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హమాలీ, ఆటో, భవన నిర్మాణం, అంగన్‌వాడీ, ఆశా కార్మికులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు క్రైం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్టీసీ బస్టాండులో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ విక్రమసింహ, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ కిషోర్ రెడ్డి నిందితుని వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన గున్న అంజి అనే యువకున్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 16 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆర్టీసీ బస్టాండులో రద్దీగా ఉన్న బస్సుల వద్ద బస్సు ఎక్కే మహిళల పర్సులను చాకచక్యంగా అపహరించి బంగారు ఆభరణాలు చోరీ చేస్తున్నాడు. నిందితునిపై పలు స్టేషన్‌లలో కేసులు కూడా ఉన్నాయి. చోరీ చేసిన సొత్తులను ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తుంటాడు. నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు డీఎస్పీ తెలిపారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

సి. బెళగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రౌడీ షీటర్లమని గ్రామాలలో విచ్చలవిడిగా రచ్చకట్ట పంచాయితీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. బురాన్‌దొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లో పర్యటించారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

పత్తి పంటను
పురుగు తినేస్తోంది!

● లబోదిబోమంటున్న రైతులు
● దిగుబడి తగ్గుతుందని రైతుల ఆందోళన


పత్తి పంట


పత్తి పంటకు యంత్రాలతో పిచికారి చేస్తున్న రైతు

ఓర్వకల్లు, ఆగస్టు 10 ఆంధ్రజ్యోతి): పత్తి పంటను పురుగు తినేస్తుంది. పంట సాగు చేసి 80 రోజులు కావస్తుంది. అయితే పంటపై తెగుళ్లు సోకడంతో కాయలు, ఆకులు రాలిపోతున్నాయి. ఆ పురుగు పూతను కాయను తినేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని హుశేనాపురం, గుట్టపాడు, ఎన్.కొంతలపాడు, ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచర్ల, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, సోమయాజుల పల్లె, కొమరోలు తదితర గ్రామాల్లో దాదాపు 5వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. పంటపై తెల్లదోమ, పచ్చదోమ వ్యాపించి రసం పీల్చడంతో ఆకుముడుతల తెగుళ్ల వల్ల పత్తి పంట నాశనం అవుతుంది. వీటిని నివారించేందుకు పురుగుమందులు వాడినా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు 10వేలకు పైగానే పెట్టుబడి పెట్టారు. ఈ పురుగు ఉధృతంతో పత్తి పంట తీవ్రంగా నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు మొరపెట్టుకుంటున్నారు.

తెల్లదోమతో పంట నాశనం


పత్తి పంటపై తెల్లదోమ, పచ్చదోమ అధికంగా ఉంది. నివారణకు ఎన్ని పురుగు మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదు. ఎకరాకు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టాం. అయితే.. పెట్టిన ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనపడటం లేదు.

● గోవిందరెడ్డి, రైతు

పంట ఎదుగుదల తగ్గుతోంది..


పంటపై పురుగు ఉధృతి అధికమైంది. దీంతో పంట ఎదుగుదల కూడా తగ్గుతోంది. కాయలు, పూతను తినేస్తుంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా లాభం లేదు.

● మోహన్ రెడ్డి, రైతు

రైతులకు అవగాహన కల్పించండి


రెండేళ్ల నుంచి పత్తి పంటను పురుగు నాశనం చేస్తోంది. రైతులకు అవగాహన లేకపోవడంతో రకరకాల మందులు వాడుతున్నారు. అయినా పురుగు నాశనం కావడం లేదు. అధికారులు పంటలను పరిశీలించి ఏ మందులు వాడాలో అవగాహన కల్పించాలి.

● పాల మధుమోహన్, రైతు

ప్రేమ, సున్నితత్వ భావాల మేళవింపే కాశీభట్ల రచనలు

● సాహితీ విమర్శకుడు వంశీకృష్ణ


'నిహితమ్'ను ఆవిష్కరిస్తున్న సాహితీ విమర్శకుడు వంశీకృష్ణ, సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత రచయిత కాశీభట్ల వేణుగోపాల్ రచనలు ప్రేమ, సున్నితత్వ భావాల మేళవింపుతో నిండి ఉంటాయని ప్రముఖ సాహితీ విమర్శకుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం నగరంలోని మద్దూర్‌నగర్‌లోని పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో, అక్షరం లిటరరీ ట్రస్టు సంస్థ ఆధ్వర్యంలో కాశీభట్ల సంస్మరణ సభ, అక్షరం లిటరరీ పురస్కార ప్రదానోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాశీభట్ల స్మరణ సంచిక 'నిహితమ్'ను ఆవిష్కరించారు. అక్షరం ట్రస్టుసంస్థ కార్యదర్శి జి. వెంకటకృష్ణ సభాధ్యక్షతన కార్యక్రమం జరిగింది. వంశీకృష్ణ మాట్లాడుతూ కాశీభట్ల తుపాను అంటి కవి అని, తన రచనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని గుర్తు చేశారు. శిల్పంతో విన్యాసం చేశారని, అయితే వస్తువు, శిల్పంతో సమన్వితం చేశారని కొనియడారు. కవిగా ఆయన ఎవరి ప్రభావంతోనూ కొట్టుకుపోలేదని, సమాజాన్ని- వ్యక్తిని, వ్యక్తిని-వ్యక్తిత్వాన్ని సమన్వయం చేస్తూ వాటిని చక్కగా స్కానింగ్ చేయగలిగిన కవి అని శ్లాఘించారు. కృత్రిమ అలంకారాలు తొడగని కవిగా, సహజసిద్ధ కవిగా ఆయన రచనలు చేశారని, ఆయన రచనలు అంత త్వరగా అర్థంకావని, అయితే ఆరచనలన్నీ జాజుల పరిమళాల వంటివని చెప్పారు. ఈ సభలో ట్రస్టు సభ్యులు అవిజ వెంకటేశ్వరరెడ్డి, కథా రచయితలు ఎస్ఎండీ ఇనాయతుల్లా, పౌరోహితం మారుతి, డాక్టర్ ఎం. హరికిషన్, డాక్టర్ నాగేశ్వరాచారి, ఎస్‌డీవీ అజీజ్, కల్యాణదుర్గం స్వర్ణలత, ఎలమర్తి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కవి తెలుగు వెంకటేశ్‌కు కాశీభట్ల పురస్కారం ప్రదానం..

ఈ సభలో అతిథులు, ఆహ్వానితులు, కవులు సంయుక్తంగా కర్నూలుకు చెందిన కవి తెలుగు వెంకటేశ్‌కు కాశీభట్ల పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. అక్షరం లిటరరీ ట్రస్టు సంస్థ కాశీభట్ల వేణుగోపాల్ పేరుతో ఇచ్చే పురస్కారాన్ని ఈఏడాదికి తెలుగు వెంకటేశ్‌కు అందజేయడంతో పాటూ రూ.25వేలు నగదు, జ్ఞాపిక, శాలువాలతో సన్మానించారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం


గ్రామంలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

గూడూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ కానాపురం గ్రామంలో విద్యుత్ స్తంభం శిథిలావస్తకు చేరింది. ఓ ప్రక్కకు ఒరిగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. కాలనీలో విద్యుత్ స్తంభం శిథిలమైన విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఆదివారం స్తంభాన్ని మండల తెలుగుయువత అధ్యక్షుడు సుమన్ బాబు పరిశీలించారు. తక్షణం ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు.

టీఎన్ఆర్ ఉచిత వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన


వేదికపై వివరాలు నమోదు చేస్తున్న బెస్త, తెలుగు, గంగపుత్ర సంక్షేమ సంఘం నాయకులు


వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సిటీ బెస్త, తెలుగు, గంగపుత్ర సంక్షేమ సంఘం, టి.ఎన్.ఆర్. మ్యాట్రిమోనీ డాట్ ఇన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నగరంలోని జడ్పీ కార్యాలయంలో గల ఎంపీపీ సమావేశ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత తహసీల్దారు జయన్న, బి. కృష్ణయ్య, నగర అధ్యక్షుడు ఆనంద్‌రాజు, డీఎస్పీ రామాంజనేయులు, కదిరి రమేష్, బీజేపీ నాయకుడు రంగస్వామి, టి.నాగరమణ హాజరై వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వేదిక నిర్వాహకులు మాట్లాడుతూ బెస్త, తెలుగు, గంగపుత్ర సంక్షేమ సంఘం ద్వారా చేపట్టిన ఈ వివాహ పరిచయ వేదికను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుమన్, మధు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుమన్, మధుబాబు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని రాముడు అధ్యక్షతన రెవెన్యూ భవన్‌లో కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సెర్ప్, మెప్మా ఉద్యోగుల మాదిరిగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్ఆర్ అమలు చేయాలన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన కనీస సర్వీసు నిబంధన పెట్టి, సంవత్సరం లేదా కనీసం రెండు సంవత్సరాలకు ఒకసారి అదనపు బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేసి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అనంతరం జేఏసీ కర్నూలు జిల్లా చైర్మన్ కేవై కృష్ణ మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో రామ్ భద్ర చారి, నాగరాజు, అమీదాబి, శ్రీధర్, సంధ్య, సరస్వతి, సోమన్న, సరోజ, సావిత్రి, యశోద పాల్గొన్నారు.

వేద పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం



దంత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాయలసీమ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులోని శంకర వేద విద్యాలయం విద్యార్థులకు ఉచిత దంత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కరివేనా బ్రాహ్మణ సత్రం కార్యదర్శి డా.ఎస్.వేణుగోపాల్ ప్రారంభించారు. ఐడీఏ రాష్ట్ర అధ్యక్షులు డా.మురళీధర్ రెడ్డి ఉపాధ్యక్షులు డా.కిషోర్ కుమార్, నాయకులు డా.రాయపు రామచంద్రారెడ్డి, ఉపేంద్రనాథ్ రెడ్డి, డా.పి.సునీల్ కుమార్ రెడ్డి, డా.నౌషాద్, డా.నరేష్ గౌడు మాట్లాడుతూ చిన్న పిల్లల్లో దంత సమ్యలను నిర్లక్ష్యం చేయవద్దని వివరించారు. ప్రతి రోజు విద్యార్థులు రెండుసార్లు దంతాలను బ్రష్ చేసుకోవాలని, అన్నం తిన్న వెంటనే నోటిని నీటితో పుకిలించాలన్నారు. చిన్నపిల్లలో తరుచుగా కలిగే ప్రమాదాలు దంతాలను కాపాడుకోవాలని డా.కిషోర్ కుమార్ వివరించారు.

వర్షపునీరు వెళ్లేందుకు దారేదీ?

● ఇళ్ల మధ్యనే నిల్వ ● ఇబ్బంది పడుతున్న ప్రజలు


రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు

కోడుమూరు రూరల్, ఆగస్టు 10, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. వర్కూరు శ్రీకృష్ణ ఆలయం ఎదురుగా కాలనీ వర్షపు నీటితో నిండిపోయింది. గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపునీరంతా ఇళ్ల మధ్యన, రోడ్లపైనే నిల్వ ఉంటుంది. దీంతో నడిచివెళ్లేందుకు కూడా వీలు లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు నుంచి వచ్చే దుర్వాసన వల్ల రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీలు కూడా నిర్మించాలని అనేక సార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వర్షపునీటిని నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

'థ్యాంక్యూ సీఎం సార్' విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న నాయీ బ్రహ్మణ నాయకులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న థ్యాంక్యూ సీఎం సార్ కార్యక్రమం విజయవంతం చేద్దామని ఉమ్మడి జిల్లా నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పాలక వీటి విజయకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నాయి బ్రాహ్మణులకు సెలూన్ షాపులకు 200యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయడం జరిగిందని తెలిపారు. కర్నూలు, పాణ్యం, కోడుమూరు, బనగానపల్లె, డోన్, నంద్యాల, ఆళ్లగడ్డ, ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల నాయిబ్రహ్మణ అధ్యక్షులు, పెద్దలు అందరూ ఐక్యమత్యంగా మేళతాళాలతో ఘనంగా చంద్రబాబు చిత్రపటాన్ని సెలూన్ షాపుల వద్ద క్షీరాభిషేకం చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తుంగా తీరానికి పయనం


స్వామి పల్లకీతో బయలుదేరిన యువకులు

కోడుమూరు రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరు గ్రామం నుంచి ఆదివారం సాయంత్రం సుమారు 200 మంది యువకులు కాలినడకన తుంగభద్ర నదికి బయలుదేరారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఏటా శ్రావణమాస మూడో సోమవారం గ్రామంలో వెంకటప్పస్వామి పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖానాపురం, బ్రాహ్మణదొడ్డి మీదుగా పోలకల్ చేరుకుని రాత్రి బస చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం తెలవారుజామున బయలుదేరి రంగాపురం సమీపంలో తుంగభద్ర నదికి చేరుతున్నట్లు తెలిపారు.

నేడు సంస్కృత భాషా దినోత్సవం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలో చిదంబరరావు వీధిలోని స్వామి వివేకానంద విద్యా సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామి వివేకానంద సంస్కృత ప్రాథమిక, ఉన్నతపాఠశాల్లో శ్రావణ పూర్ణమిని పురస్కరించుకొని సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సంస్కృత భాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి, న్యాయవాది ఎండీవీ జోగయ్య శర్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా శ్రీచైతన్య జూనియర్ కళాశాల సీనియర్ లెక్చరర్ ఎం.ప్రభాకర్ హాజరవుతారని ఆయన తెలిపారు. సంస్కృత భాష అభిమానులంతా ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయుడి మృతికి డీటీఎఫ్ సంతాపం

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు బాలుర ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వి.శివనాగరాజు మృతి చెందడం పట్ల డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె కృష్ణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప గోట్ల చంద్రశేఖర్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల కర్నూలు ఉల్చాల రోడ్డులోని వై.జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. కర్నూలులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తె ఉన్నారు. శివనాగరాజుకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

13న తలసేమియా రోగుల కోసం రక్తదానం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రగతి సమితి అధ్వర్యంలో 13న తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష ఆదివారం తెలిపారు. కొండారెడ్డి బురుజు వద్ద ఉదయం 11 గంటలకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. రక్తదానం చేయడం వల్ల సమాజానిక, శరీరానికి ప్రయోజనాలు లభిస్తాయన్నారు. రక్తం ఇవ్వడానికి ఆసక్తి కలిగిన వారు 7993991234కు సంప్రదించాలన్నారు.

మైఫర్‌లో ప్లేస్‌మెంటు డ్రైవ్

● వంద మంది ఉద్యోగాలకు ఎంపిక



ప్లేస్‌మెంటు డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మహాలక్ష్మి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏ.క్యాంపులోని మైఫర్ ఫార్మసీ కళాశాలలో ఆదివారం జరిగిన ప్లేస్‌మెంటు డ్రైవ్‌లో వంద మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అరబిందో ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు ఎం.ఫార్మసీ, బీ.ఫార్మసీ, బీఎస్సీ, డిప్లమా కోర్సులు పూర్తి చేసిన వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ పోజిషన్లకు నిర్వహించిన ప్రక్రియలో వంద మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారందరికీ ఆఫార్ లెటర్స్‌ను అందజేశారు. కళాశాల డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డా.కాసర్ల సురేష్, అకడమిక్ డీన్ డా.రాజ్‌కుమార్, ప్లేస్‌మెంటు ఆఫీసర్స్ ప్రశాంత్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలను సకాలంలో చెల్లించాలి

సి. బెళగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు బకాయిలను సకాలంలో చెల్లించాలని విద్యుత్ ఏడీ జేసన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో విద్యుత్తు వినియోగదారులు తమ వ్యవసాయ మోటార్ల దగ్గర మరమ్మతులు చేసుకునే సమయంలో విద్యుత్ అధికారులకు సమాచారం అందజేసి మరమ్మతులు చేసుకోవాలన్నారు. గూడూరులో విద్యుత్ వినియోగదారుల సేవ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలికల జట్టు ప్రతిభ


అట్యా పాట్యా క్రీడలో మూడో స్థానంలో నిలిచిన జిల్లా జట్టు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరిగిన జూనియర్ అట్యా పాట్యా రాష్ట్రస్థాయి క్రీడల్లో కర్నూలు జిల్లా బాలికలు నెల్లూరు జిల్లాపై 12-8 తేడాతో విజయం సాధించారు. 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. అట్యా పాట్యా జిల్లా అధ్యక్షులు కే.నాగరత్నమయ్య అభినందించారు.



మద్దికెర నుంచి బుగ్గ, కసాపురానికి వెళ్లే ఆర్‌అండ్ బీ రోడ్డు అధ్వానంగా మారింది. చిన్న వర్షం పడినా చిత్తడిగా మారి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పెడుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. - మద్దికెర



మండలంలోని బల్లూరు గ్రామంలో 300 గృహాలు ఉన్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీ లేకపోవడంతో రహదారి మొత్తం బురద, మురుగుతో నిండిపోయింది. అధికారులు పారిశుధ్య పనులు చేయించాలని, నూతన రహదారులు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - హాలహర్వి



బుర్రకుంట గ్రామం రహదారి రాళ్లు తేలాయి. గతంలో మట్టిరోడ్డు వేసి వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు ఈ దారిలో వెంకటాపురం, గుడిమిరాళ్ల గ్రామాలు ఉన్నాయి. నూతన రహదారి నిర్మించాలిన స్థానికులు కోరుతున్నారు. - దేవనకొండ.

17న పరుగు పోటీలు

మద్దికెర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ఈ నెల 17న ఆదివారం సాయంత్రం రాయలసీమ స్థాయి పరుగు పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వాహకులు మాట్లాడుతూ 18 ఏళ్లకు పైబడ్డ 3.5 కి.మీ.ల దూరం ఉంటుందన్నారు. ప్రథమ బహుమతి రూ.10,116లు, రెండో బహుమతి రూ.5,116లు, మూడో బహుమతి రూ.3,116లు ఇస్తామని రూ.వంద చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. క్రీడాకారులకు మాత్రమే భోజనం ఉంటుందని, వివరాలకు 9885297904, 9642776458, 7659980304 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

● ఆదోనిలో సాయుధ బలగాల కవాతు



డీఎస్పీ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఆదోని, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హేమలత హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలు డీఎస్పీ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించాయి. టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి భీమా సర్కిల్, శ్రీనివాస భవన్ మీదుగా వన్‌టౌన్, బంగారు బజార్, చిన్న మార్కెట్ మీదుగా కవాతు నిర్వహించారు. సీఐలు శ్రీరామ్, రామలింగమయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

హొళగుంద: మండల కేంద్రంలో ఆదివారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఆలూరు సీఐ రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ ఈబీసీ కాలనీ నుంచి బస్టాండ్, దిడ్డి కాలనీ, చాకలి వీధి, పెద్ద మజీద్ వీధి, హనుమాన్ ఆలయం మీదుగా బీసీ కాలనీ వరకు ప్రజల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకే కవాతు చేశారన్నారు. రానున్న వినాయకచవితి, స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తతీసుకున్నామని సీఐ తెలిపారు. ఈ ర్యాలీలో ర్యాపిడ్ అసిస్టెంట్ కమాండెంట్ పాపారావు, ఇన్‌స్పెక్టర్లు బి.రాజు, భారతి, ఆలూరు ఎస్ఐ మహబూబ్ బాషా, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



హొళగుందలో కవాతు..

ఆలూరు అభివృద్ధికి కృషి : ఎంపీ



కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో నాయకులు

ఆస్పరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం మండలంలోని అట్టేకల్ గ్రామంలో సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారం, రహదారుల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, వాల్మీకి ఫెడరేషన్ చైర్‌పర్సన్ బుజ్జమ్మ, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం జ్యోతి, మాజీ ఎంపీపీలు కృష్ణయాదవ్, వెంకటేష్, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

మాకు సమాచారం ఇవ్వరా?

● ఓ కంపెనీ షోరూం ప్రారంభంపై ఏవో సుధాకర్ ఆగ్రహం

ఆదోని, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రారంభించిన ఓ పురుగు మందుల దుకాణాన్ని సందర్శించిన ఏవో సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా ఎలా మొదలు పెట్టారని నిర్వాహకులను ప్రశ్నించారు. వెంటనే 'స్టాప్ సేల్' ఇవాలని అక్కడే ఉన్న క్లర్కును ఆదేశించారు. స్పందించిన మేనేజర్ అయ్యస్వామి సమాచారం ఇచ్చామన్నారు. ఈ విషయంపై ఏవో సుధాకర్‌ను వివరణ కోరగా ఆదోనిలో ఇంత పెద్ద దుకాణాన్ని తెరిచే సమయంలో వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని ఇలా తెరవడం పద్ధతి కాదన్నారు.

వర్షాలతో జాగ్రత్త


తుగ్గలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ రవి, డీటీ సుదర్శన్ సూచించారు. ఆదివారం మాట్లాడుతూ మండలంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని, రైతులు పొలాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేసేవారు త్వరగా ఇళ్లకు చేరుకోవాలన్నారు. ప్రభుత్వం ఫోన్లకు సమాచారం పంపిస్తోందని, ఆ సూచనలు పాటించాలన్నారు. పంట నష్టం సంభవిస్తే సంబంధిత అధికారులకు వివరాలు ఇవ్వాలన్నారు.

గిడ్డయ్య ఎంపికపై హర్షం

మద్దికెర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శిగా గిడ్డయ్యను మూడోసారి ఎంపికైన చేయడం పట్ల ఆ పార్టీ నాయకులు నాగరాజు, హనుమన్న, కోదండరాముడు ఆదివారంహర్షం వ్యక్తం చేశారు. గిడ్డయ్యతో పార్టీ బలోపేతం అవుతుందన్నారు.

రాజస్థాన్‌లో ఉపాధ్యాయినికి శిక్షణ

● ప్రశంసా పత్రం అందజేసిన సీసీఆర్‌జీ చైర్మన్



ప్రశంసా పత్రం అందుకుంటున్న భూమా శ్రీదేవి

పత్తికొండ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యావిధానంపై పత్తికొండ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని భూమా శ్రీదేవి రాజస్థాన్‌లో శిక్షణకు హాజరయ్యారు. వివరాల మేరకు.. ఉదయ్‌పూర్‌లో సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ కేంద్రంలో 21 రోజులు జాతీయ శిక్షణ ఇచ్చారు. కూచిపుడి నాట్యం, జానపద గీతాలు, శిల్పకళా, చిత్రకళా, సంగీత నాట్యం, కళా రూపాలను వివరించారు. చివరిరోజు శ్రీదేవికి సీసీఆర్‌జీ చైర్మన్ డా.వినోద్‌నారాయణ సర్టిఫికెట్‌ను అందించారు. ఈ శిక్షణ మంచి అనుభూతిని కలిగించిందని శ్రీదేవి అన్నారు.

ఇసుకాసురులు

● ప్రభుత్వ పనుల ఇసుక మాజీ ఎమ్మెల్యే అనుచరుడికి చేరవేత
● వాహనంపై పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ఉన్న స్టిక్కర్
● అధికార, ప్రతిపక్ష నాయకులు కుమ్మక్కయ్యారని ఆరోపణలు



వాహనంపై ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ఉన్న స్టిక్కర్

ఆదోని రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగనన్న కాలనీలో ప్రభుత్వ గృహాలను నిర్మిస్తున్నారని మంత్రాలయం సమీపంలోని గుడికంబాల ఇసుక రీచ్ నుంచి ఈ గృహాల నిర్మాణానికి సంబంధిత కాంట్రాక్టర్ ఇసుకను తరలిస్తున్నారు. అయితే సదరు కాంట్రాక్టర్ మాజీ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు క్లాస్-1 కాంట్రాక్టర్‌కు చెందిన ఆదోని - ఎమ్మిగనూరు బైపాస్‌లోని కాంక్రీట్ మిషన్‌కు తరలిస్తున్నారు. ఈ కాంక్రీట్‌ను రహదారుల నిర్మాణం, స్లాబ్ వేసేందుకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా వాహనానికి సీఎం, డిప్యూటీ సీఎం, ప్రధాని ఫొటోలు ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. కాగా ఈ వాహనం కాంక్రీట్ మిషన్ వద్ద ఉండటాన్ని ప్రశ్నించినా వారిని కొందరు కూటమి నాయకులు బెదిరిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఈ దందాను ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ గృహ నిర్మాణాల కోసం తరలించే ఇసుక లారీలకు మన ఇల్లు - మన గౌరవమని బ్యానర్ ఉంటుంది. బ్యానర్‌పై ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫొటోలు ఉంటాయి. ఈ ఫొటోలతో కూడిన వాహనాల నుంచి తరలించే ఇసుకను ప్రైవేటు పనులు చేసే కాంట్రాక్టర్‌కు తరలించకూడదని చాలాసార్లు చెప్పాం. అయినా మా మాట వినడం లేదు. పర్సనల్ అని అంటున్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - శివమూర్తి, హౌసింగ్ ఎ.ఈ, ఆదోని

రెండు రోజుల క్రితం ఇసుక లారీ స్వాధీనం..

● కేసు నమోదు చేయని పోలీసులు



పెద్ద తుంబళం స్టేషన్‌లో ఉన్న ఇసుక లారీ

మండలంలోని పెద్దతుంబళం పోలీసులు ఓ ఇసుక లారీని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇంతవరకు మాత్రం కేసు నమోదు చేయంకుడా పంచాయితీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వివరాల మేరకు.. శనివారం మధ్యాహ్నం కుప్పగల్లు మీదుగా ఆదోని వైపు వస్తున్న ఏపి 39 ఎక్స్ 1144 నెంబర్ గల ఇసుక లారీని పోలీసులు సీజ్‌చేసి స్టేషన్‌ను తరలించారు. అయితే ఆదివారం సాయంత్రం గడిచిన కేసు నమోదు కాలేదు.

హామీలు నెరవేరుతున్నాయి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుతున్నాయని టీడీపీ నాయకులు గూడూరు ధనుంజయుడు, ఆవుల పెద్దన్న, బురుజుల మోహన్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని, 'అన్నదాత సుఖీభవ' కింద 7వేల మంది లబ్ధి పొందారనీ గుర్తు చేశారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని, 20 ఏళ్ల తర్వాత పెరవలి, వయా పెరవలి, ఎం.అగ్రహం, హంపా గ్రామాల మీదుగా బస్సులు ఏర్పాటు వేయించారన్నారు. మంగల సోమశేఖర్, శేఖర్ ఉన్నారు.

పేదల అభివృద్ధే ధ్యేయం

● అధికారులు సమస్యలను పరిష్కరించాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పేదలు, బడుగులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని, అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఆదివారం పగిడిరాయి గ్రామంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ, పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు, కోసం పీ-4 కార్యక్రమాలను చేపట్టామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, వెంకటపతి, చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు గౌడు, మిద్దె వెంకటేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

విగ్రహాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి



సీఐ నల్లప్ప

ఆదోని రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మంటపాల్లో గణేష్ విగ్రహ ప్రతిష్ఠకు పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని రూరల్ సీఐ నల్లప్ప తెలిపారు. ఆదివారం మాట్లా డుతూ, మండలంలో 44 గ్రామాలు ఉన్నా యని, ఎక్కడ నిర్వహించినా ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అనుమతి పొందాలన్నారు. విగ్రహాలు కూర్చోపెట్టే చోట ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినాయక చవితి ముసుగులో అల్లర్లకుపాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.


ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడాలి



మాట్లాడుతున్న వీరచంద్రయాదవ్

ఆదోని అగ్రిలక్పర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్లక్ష్యం ధోరణి వీడాలని ఎస్టీయూ పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ కోరారు. ఆదివారం ప్రాంతీయ కార్యాలయంలో పట్టణ ప్రధాన కార్యదర్శి భీమాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్‌సీ, డీఏలు ఇస్తామని చంద్రబాబు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్న పీఆర్‌సీ ఊసే లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరిగా కొనసాగించాలని కోరారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ మూల్యాంకనంలో పాల్గొన్న సిబ్బందికి ఇంతవరకు పారితోషికం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. రమేష్ నాయుడు, రవి, లోక్యానాయక్, ప్రహల్లాద, సుధాకర్ పాల్గొన్నారు.

యూరియా కొరత రానివ్వొద్దు



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు కొట్టాల రాజు

ఆలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో యూరియా కొరత రాకుండా చూడాలని వైసీపీ సమాచార చట్టం విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టాల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎం.కొట్టాల గ్రామంలో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన మేర యూరియా లభించడం లేదన్నారు. వరి, పత్తి, ఉల్లిగడ్డ, వరి సాగు చేసిన రైతులకు అధిక మోతాదులో యూరియా అవసరమన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే విరుపాక్షి దృష్టికి తీసుకెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. నాయకులు పి.ప్రసాద్, రంగముని, విజయ్‌కుమార్, జైపాల్ గోపాల్, మోష, శాంతరాజు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కరువు

ఆలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలో మహిళలకు భద్రత కరువైందని వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కురువ శశికళ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తుండటంతో మహిళలు ధైర్యంగా తిరగలేని పరిస్థితి ఉందన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పి, కొన్ని బస్సులకు మాత్రమే అనుమతి ఇచ్చారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

చైర్మన్ పదవికి దరఖాస్తులు

మద్దికెర, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగనాథస్వామి ఆలయ చైర్మన్ పదవికి దరఖాస్తు చేసుకోవాలని ఈవో వీరయ్య తెలిపారు. 15 నెలలుగా నదవి ఖాళీగా ఉందని, దరఖాస్తు చేసుకునే వారిపై కేసులు ఉండకూడదని, హిందూ మతస్థులై ఉండాలన్నారు. దరఖాస్తులను దేవదాయ అధికారులకు పంపుతామని తెలిపారు. సిబ్బంది రఘు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

కారు ఢీ.. గాయాలు

ఆలూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హత్తిబెళగల్ బస్టాండు సమీపంలో బైకును కారు ఢీ కొట్టడంతో ఇద్దరు రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ ఓకాంర్, రామచంద్రలు ఆలూరు-గుంతకల్లు రహదారిలో ఆదివారం ఉదయం బైకుపై పొలానికి వెలుతున్నారు. గుంతకల్లు నుంచి వస్తున్న కారు టైరు రాడ్ కట్ కావడంతో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టింది. ఓంకార్ కాలు విరిగింది, రామచంద్రకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆలూరు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి గల్లంతు

హొళగుంద, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువలో స్నానానికి వెళ్లి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. వివరాల మేరకు.. కోటవీధికి చెందిన అంజినయ్య వరినాట్లు వేసి ఆదివారం సాయంత్రం కడ్లేమాగి వద్ద ఉన్న ఎల్ఎల్‌సీ కాలువలో స్నానానికి దిగాడు. కాలు జారడంతో కాలువలో పడిపోయాడు. ప్రవాహం అధికంగా ఉండటంతో ఆచూకీ లభ్యం కాలేదు.

అరెస్టు చేయాలి

ఆదోని అగ్రిలక్పర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో సచివాలయ మహిళ ఉద్యోగిని కిడ్నాప్ చేసిన నిందితులను అరెస్టు చేయాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి రామచంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ ఉద్యోగి సౌమ్యను గుర్తుతెలియని వ్యక్తులు సచివాలయంలోకి ప్రవేశించి బలవంతంగా కారులో కిడ్నాప్ చేశారన్నారు.

ఆవిర్భావ వేడుకలు



జెండాను ఆవిష్కరించిన నాయకుడు కృష్ణమూర్తి

ఆదోని అగ్రిలక్పర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): :యూటీఎఫ్ 52వ ఆవిర్భావ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ప్రాంతీయ కార్యాల యలో కృష్ణమూర్తి, పాపయ్య యూటీ ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కృష్ణమూర్తి, పాపయ్య, జిల్లా సహాధ్యక్షురాలు జీవిత, పట్టణ అధ్యక్షుడు సునీల్ రాజ్ కుమార్ మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఆవిర్భావించిందన్నారు. శ్రీనివా సులు, సుధాకర్, మల్లికార్జున, ఓంకార్ ఉన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



తండాలో ట్యాంకర్లతో నీటి సరఫరా

తుగ్గలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోళ్లపాడు తండా గ్రామానికి ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు. భారీ వర్షానికి పైపులైన్ కొట్టుకుపోయిందని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన పంచాయతీ సలహాదారుడు బాబు నాయక్, అధికారులు ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. త్వరలో నూతన పైపులైన్ వేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

దేవరగట్టులో డోలు మోత



దేవరగట్టులో డోలు వాయిస్తున్న భక్తులు

హొళగుంద ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయం ఆదివారం డోలు మొతతో మార్మోగింది. కార్తీకమాసం మూడో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పంపాస్వామి, మహేష్ స్వామి ఆదివారం తెలిపారు. భక్తులకు అన్నదానం చేశామన్నారు.

17న సమావేశం

హొళగుంద ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న ఆదోనిలోని జేపీ గార్డెన్‌లో వాల్మీకుల ఎస్టీ సాధనకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ జడ్‌పీటీసీ రాంభీం నాయుడు అన్నారు. ఆదివారం సిద్దేశ్వర రైస్ మిల్‌లో మాట్లాడుతూ బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి ముఖ్య నాయకులు వస్తారన్నారు. కుమార్, కోగిల తోట నాగప్ప, నర్సయ్య, వస్సూరప్ప, కాకి వీరేష్ పాల్గొన్నారు.

నాలుగు కాళ్ల కోడిపిల్ల



హొళగుంద, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సాధారణంగా కోడికి రెండు కాళ్లు మాత్రమే చూసి ఉంటాం. అయితే హొళ గుందకు చెందిన చినిగి సాబ్ అనే రైతు ఇంట్లో రెండు రోజుల క్రితం ఏడు కోడి పిల్లలు పొదగగా వాటిలో ఓ కోడి పిల్ల ఏకంగా నాలుగు కాళ్లతో జన్మించింది. దీంతో ఈ కోడిపిల్లను చూడడానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. నాలుగు కాళ్లు ఉండడంతో కోడి పిల్ల నడిచేందుకు ఇబ్బంది పడుతోందని యజమాని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ క్రాంతికుమార్‌ను వివరణ కోరగా.. జన్యుపరమైన లోపంతో ఇలా జరిగి ఉంటుందని చెప్పారు.

నీట మునిగిన పంటలు



కేపీ గుడిసెల్లో భారీ నీట మునిగిన క్యాలీఫ్లవర్ పంట

తుగ్గలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పంటలు నీట మునిగాయి. మండలంలోని కేపీ గుడిసెల, రామలింగాయపల్లె గ్రామాల్లో క్యాలీఫ్లవర్, కంది, సజ్జ సాగు చేశారు. పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రూ.90వేలు నష్టం

మూడు ఎకరాల్లో క్యాలీఫ్లవర్ సాగు చేశాను. నర్సరీ నుంచి మొక్కలు తేవడానికి రూ.80వేల ఖర్చు చేశాను. నాటేందుకు రూ.10వేలతో కలిపి, మొత్తం రూ.90వేల వరకు నష్టం వాటిల్లింది.



- దేవేంద్ర, రైతు, కేపీ గుడిసెల

ఆగని అక్రమ రవాణా

● చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో ఎర్ర గరుసు అక్రమ రవాణ ఆగడంలేదు. మండలంలోని బనవాసి ఫారం, కడిమెట్ల, గుడికల్లు గ్రామాల నుంచి ఎర్ర గరుసు అక్రమార్కులకు అడ్డు కట్ట లేకుండా పోయింది. రాత్రి, పగలు తేడా లేకుండ ట్రాక్టర్లలో ఎర్ర గరుసును తరలించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తె లిసినా ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో ఎర్రగరుసు కొండలు కాస్తా అక్రమార్కుల తవ్వకాలకు కరిగిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కొండలపై ఉన్న ఎర్ర గరుసును తవ్వి అమ్ముకోవడమేగాక కొండ ప్రాంతాన్ని చదును చేసి పొలాలుగా మార్చుకుంటున్నారు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే అక్రమాలకు అడ్డుకట్ట పడడంలేదని ఆయా గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు.


మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్

చెట్లను నరికి..గుంతలు తీసి: మండలంలోని బనవాసి ఫారంలో ఉన్న అటవీ ప్రాంతంలోని చెట్లను నరికి మరి ఎర్రగరుసును తరలిస్తున్నారు. బనవాసి ఫారం అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రమట్టికి మంచి డిమాండ్ ఉండడంతో కొంతమంది ఎర్రమట్టి కోసం గుంతలను తవ్వారు. దీంతో అటవీ ప్రాంతం గుంతల మయంగా మారింది.

పట్టించుకోని అధికారులు: ఎవరైనా ఎర్ర గరుసు కావాల్సిన వారు ముందుగానే రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. అయితే ఎమ్మిగనూరు మండలంలో మాత్రం ఏ ఒక్కరు కూడా అనుమతులు తీసుకోరు. అనుమతులు లేకుండానే ట్రాక్టర్లకు..ట్రాక్టర్ల ఎర్రగరుసు తవ్వి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. వాస్తవానికి ఇదంతా అధికారులకు తెలిసినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. ప్రతినెల అధికారులకు మామూళ్లు ముడుతుండడం వల్లే అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ శేషఫణిని వివరణ కోరగా ఆయన అందుబాటులోకి రాలేదు.


మట్టిని తవ్విన దృశ్యం

పట్టించుకునే నాథుడే లేరు

ఎమ్మిగనూరు మండలంలో అక్రమ గరుసు రవాణా అధికారుల కళ్లెదుటే జరుగుతుంది. అయినా ఏ అధికారి కూడా పట్టించుకోవడంలేదు. మండలంలో ఉన్న కొండ ప్రాంతాల నుంచి అక్రమార్కులు ఎర్రమట్టిని తవ్వి అమ్ముకుంటున్నారు. ఇదంతా అధికారులకు కూడా తెలుసు.. అయినా వారు మాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో కొండలు కరిగి భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి అక్రమంగా గరుసు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సత్యన్న, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి

సమస్యలు పరిష్కరించాలి: యూటీఎఫ్


ఎమ్మిగనూరులో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయుల అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దావీదు, జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు డిమాండ్ చేశారు. సోమప్ప సర్కిల్‌లో యూటీఎఫ్ 52వ ఆరిర్భావ దినోత్సవం సందర్భంగా సోమప్ప సర్కిల్ నందు జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1974లో యుటిఎఫ్ సంఘం ఏర్పడినప్పటి నుంచి ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కొరకు నిరంతరం కృషి చేస్తూ హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాగమణి, కౌలన్న, రాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: యూటీఎఫ్ సంఘం నిరంతరం పోరాటాలు చేస్తునే ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మలబాబు, అన్నారు. ఆదివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గోనెగండ్లలో జెండాను ఆవిష్కరించారు. నాయకులు లింగన్న, నరసింహులు, నాగరాజు, రామన్, అక్బర్, జిక్రియ, వీరేష్, గోవిందుబాబు పాల్గొన్నారు.



గోనెగండ్లలో..

రోడ్లపై నీరు.. వాహనదారుల అవస్థలు


గుంతలు పడ్డ కల్లుకుంట- పెద్దకడబూరు రోడ్డుపై నిలిచిన నీరు

పెద్దకడబూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి):పెద్దకడబూరు మండల పరిధిలోని పెద్దకడబూరు-కల్లుకుంట రహదారి నీటి కుంటలా మారింది. గత వారం రోజులుగా వ ర్షాలు కురుస్తుండడంతో రహదారిలో పడ్డ గుంతల్లో వర్షపు నీరు నిలిచి నీటి కుంటలా మారింది. ఈ దారి గుండ ప్రయాణించాలంటే ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. అంతేగాక వీధిలోని ప్రజలు రాత్రివేళల్లో బయటకు రావాలంటే వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలమయంగా ఉన్న దారికి మరమ్మతులు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా గౌస్ పీరా

ఎమ్మిగనూరు, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ పరపతి సహకారసంఘానికి ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నామినేట్ చేసింది. ఈ మేరకు ఆదివారం జాబితాను విడుదల చేసింది. ఎమ్మిగనూరు పీఏసీఎస్ అధ్యక్షులుగా సోగనూరు గ్రామానికి చెందిన గౌస్ పీరాను సభ్యులుగా ఆరెకంటి దేవదాసు, కరణం రవికుమార్(జనసేన పార్టీ)ను నియమించిది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి సొసైటీకి నామినేటేడ్ కమిటిని నియమించాలని కోరుతూ ప్రతిపాదనలను పంపించారు. దీంతో ప్రభుత్వం త్రిసభ్య కమిటిని నియమించింది.

ఎద్దులబండిని ఢీకొట్టిన కారు




ధ్వంసమైన కారు

మంత్రాలయం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):మంత్రాలయం మండలంలోని చిలకలడోన గ్రామ సమీపంలో బూదూరు క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళ్తున్న ఎద్దుల బండిని కారు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. రెండు వృషభాలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం ఆదివారం జరిగింది. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ ప్రకారం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని కర్నాటకకు చెందిన భక్తులు కారులో వెళ్తుండగా.. ఎరువులు చల్లుకుని ఇంటికి వెళ్తున్న చిలకలడోనకు చెందిన ఎద్దుల బండిపై వెళ్తున్న చాకలి నరసింహులు, దేవేంద్రలను ఢీకొట్టింది. దీంతో నరసింహులుకు, దేవేంద్రకు కారులో ఉన్న చిన్నమ్మకు గాయాలయ్యాయి. రెండు ఎద్దులు కూడా తీవ్రంగా గాయపడ్డాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది. చికిత్స నిమ్మితం ముగ్గురిని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. ఎద్దులకు విషమంగా ఉండటంతో మండల పశు వైద్యాధికారి చికిత్సలు చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న సినీ నటుడు

కోసిగి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని రేణుకా ఎల్లమ్మ దేవిని ఆదివారం సినీ నటుడు విక్రమ్ దర్శించుకున్నారు. కోసిగి ప్రజలతో కొద్ది సేపు సందడి చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు శాలువలతో సన్మానించారు. విక్రమ్ మాట్లాడుతూ గుండుతోనే తనకు ఫిల్మ్ ఇండస్ట్రీలో మంచి ఫేమ్ వచ్చిందని చెప్పారు.


విక్రమ్

ఆట్యా పాట్యాలో మూడో స్థానంలో కర్నూలు

● కోసిగికి చెందిన క్రీడాకారుల ప్రతిభ

కోసిగి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆట్యా పాట్యా స్టేట్ మీట్‌లో కర్నూలుకు మూడో స్థానంలో నిలిచింది. ఒంగోలు జిల్లా కేంద్రంలోని ఏబీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆట్యా పాట్యా స్టేట్ మీట్‌లో కర్నూలు జట్టు మూడో స్థానం దక్కించుకుందని ఆట్యా పాట్యా జిల్లా సెక్రటరీ బాబు తెలిపారు. కర్నూలు జట్టులో కోసిగి కేజీబీవీకి చెందిన ఆరుగురు విద్యార్థినులు మంచి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కోచ్‌లు కె.సుమంగళ, వెంకటేశ్వరి దేవి, మనీషా తెలిపారు. కోసిగి చెందిన కేజీబీవీ విద్యార్థినులు బి.శారద, అమృత, స్వాతి, సువార్ణ, అమృత, రాధిక ఆట్యా పాట్యా ఆటలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో వారికి మెడల్స్ అందించారు. మొదటి స్థానం పల్నాడు జిల్లా, రెండో స్థానం ఒంగోలు, మూడో స్థానలో కర్నూలు జట్టు నిలవడంతో పలువురు ఉపాధ్యాయులు డీఈవో అభినందనలు తెలిపారు.


ఆట్యాపాట్యా క్రీడలో మూడో స్థానంలో నిలిచిన కర్నూలు జట్టు

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి):ఎమ్మిగనూరు మండల పరిధిలోని సిరాలదొడ్డి గ్రామ సమీపంలో వెలసిన ఆంజనేయస్వామికి ఆలయ ధర్మకర్త వడ్డె వెంకటేష్ ఆధ్వర్యంలో ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని స్వామివారికి తెల్లవారు జాము నుంచే జలాభిషేకం, పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం, మహాగణారాధన, మహామంగళహారతి నిర్వహించారు. రాత్రి స్వామివారి ఆలయంలో భజనా కార్యక్రమాలను నిర్వహించి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


వాహనాలను తరలిస్తున్న దృశ్యం

మంత్రాలయం, ఆగస్టు 10 (ఆంధ్ర జ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ఉత్సవాలకు ట్రాఫిక్ అంటే పద్మవ్యూహం లాంటిది. ఇలాంటి ట్రాఫిక్‌ను డీఎస్పీ ఎంఎన్ భార్గవి, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లోనే సొంత వాహనాలను కట్టడి చేసే ప్రయత్నాలు చేశారు. రోడ్డు పక్కన మోటారు సైకిళ్లు, కార్లు ఇతర వాహనాలు నలిపితే ప్రత్యేక క్రేన్ యంత్రంతో ఎక్కించి ఊరి బయట పార్కింగ్ చేస్తున్నారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టడంతో ట్రాఫిక్ నియంత్రణ విజయవంతమైంది. నాలుగు రోజుల్లో వాహనాలు ఎక్కడ పడితే అక్కడ ఆపడం, భక్తులు, గ్రామస్థులు, ప్రయాణీకులు ట్రాఫిక్‌లో ఇరుక్కుని నరకం చూసేవారు. ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని హెలిప్యాడ్ మైదానం, పరిమళ పాఠశాల, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా పార్కింగ్ స్థలం, నదితీరం, పాత ఆర్అండ్‌బీ, నాగలదిన్నె రోడ్డులో ఏర్పాటు చేసిన ఖాళీ స్థళంలో వాహనాల పార్కింగ్ చర్యలు తీసుకోవడం విజయవంతమైంది. దీంతో భక్తులు, గ్రామస్థులు పోలీసుల చర్యలను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

● రూ.14,500 స్వాధీనం

మంత్రాలయం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):మంత్రాలయం మండలంలోని మాధవరం సమీపంలో ఆదోని రోడ్డులో విద్యుత్‌సబ్ స్టేషన్ వెనుకాల పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. ఆదివారం మాధవరం చెందిన 9 మంది, రచ్చుమర్రికి చెందిన ఒకరు పేకాట ఆడుతుండగా.. రహస్యంగా వచ్చిన సమాచారం మేరకు దాడులు చేశారు. వారి వద్ద నున్న రూ.14,500లు పేకముక్కలను స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి: ఆదోని ఎమ్మెల్యే


ఆదోని ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఎమ్మిగనూరు,ఆగష్టు10(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వెనుకబడిన నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. పట్టణ శివారులోని ఆదోని రోడ్డులో ఉన్న విశాల గార్డెన్‌లో ఎమ్మెల్యే డా పార్థసారథిని బీజేపీ రాష్ట్రకమిటి ప్రత్యేఆహ్వానితులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది పురుషోత్తం రెడ్డి ఆద్వర్యంలో మంత్రాలయం, ఎమ్మిగనూరు బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, రాష్ట్ర నాయకులు విట్టారమేష్, జిల్లా ఇన్‌చార్జీ అంకాల్ రెడ్డి, నాయకులు తొగట నరసింహులు, గురురాజ దేశాయ్, కౌన్సిలర్ దయాసాగర్, లలిత్ జైన్, బీఎన్ ఈరన్న పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గోనెగండ్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి):పేదలకు సంక్షేమ పథకాలు, గ్రామాలలో అభివృద్ధి పనులు టీడీపీ తోనే సాధ్యం అని గోనెగండ్ల టీడీపీ నాయకులు అక్బర్‌బాషా, రాజశేఖర్‌ఆచారి, సాగునీటిసంఘం టీసీ మెంబర్ కడపల చిన్న వెంకటేష్, రస్తా ద్దీన్, అన్నారు. ఆదివారం వారు మట్లాడుతూ ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పేరుతో మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు సౌకర్యాన్ని సీఎం చంద్రబాబు కల్పిస్తున్నారని ఈ పథకం మహిళలకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలో వృద్దులకు, వికలాంగులకు, వితంతువులకు, రూ. 4వేలు, రూ. 6వేలు, రూ. 10వే లు ప్రతి నెల అందజేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. అలాగే ఉచితంగా ఏడాదికి మూడు సిలిండర్‌లు, 'తల్లికివందనం' అన్నదాత సుఖీభవ, గ్రామాలలో అభివృద్ధి పనులు సీసీరోడ్లు, డ్రైనేజిల ఏర్పాటు నీటి ట్యాంక్‌లు పైపులైన్ నులు చేపట్టినట్లు వారు గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు పేదల పక్షపాతి అన్నారు.

ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

ఎమ్మిగనూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద దాడులను తిప్పికొట్టిన మనదేశ సైనికుల త్యాగాలకు మద్దతుగా ఆదివారం బీజేపీ రాష్ట్ర కమిటి పిలుపుమేరకు పార్టీలకు అతీతంగా ఎమ్మిగనూరు పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, బీజేపీ రాష్ట్రకమిటి ప్రత్యేఆహ్వానితులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది పురుషోత్తం రెడ్డి, నాయకులు గురురాజదేశాయ్, విట్టా రమేష్, కౌన్సిలర్ దయాసాగర్, నరసింహులులతో పాటు వివిద నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని శివసర్కిల్ నుంచి బస్టాండ్, సోమప్ప సర్కిల్ మీదుగా వైఎస్ఆర్ సర్కిల్ వరకు సాగింది. ర్యాలీలో విద్యార్థులు వంద అడుగుల జాతీయపతాకాన్ని ప్రదర్శిస్తు ర్యాలీచేశారు. అలాగే ర్యాలీలో పాల్గొన్న వందలాది మంది జాతీయజెండాను పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయపతాకాన్ని కీర్తిస్తు నినాదాలు చేశారు. అనంతరం వైఎస్ఆర్ సర్కిల్‌లో నాయకులు మాట్లాడుతూ దేశంపై ఉగ్రదాడులు జరిగిన సమయంలో మన దేశ సైనికులు వీరోచితంగా పోరాడి ఉగ్రదాడిని తిప్పికొట్టారని కొనియాడారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం ఆపరేషన్ సింధూర్ అని అన్నారు. వీర సైనికులకు మద్దతుగా మేమంతా మీవెంటే ఉన్నామని తెలిపేందుకే హర్ ఘర్‌క తిరంగ ర్యాలీఅని అన్నారు. ఆగష్టు 15న ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై జాతీయజెండాను ఎగురవేసి దేశసైనికులకు మద్దతు పలకాలని కోరారు. వీరోచింగా పోరాడుతున్న మన సైనికుల గురించి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవెవో మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశాన్ని ఆరవైఏళ్లు పాలించిన కాంగ్రెస్ దేశాన్ని అస్తవ్యస్తం చేసిందన్నారు. నరేంద్రమోడి ప్రధానమంత్రి అయిన తరువాత 11 ఏళ్లకాలంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. అనేక సంక్షేమపథకాలు, అభివృద్ధికార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు కోరిశెట్టి జెట్టప్ప, శివ, బీఎల్ నారాయణ, జగ్గాపురం ఈరన్న, బీఎన్ ఈరన్న, శిల్పి భాస్కర్, ఉరుకుందు, వెకంటేశులు,మాజీ సర్పంచ్ రామన్న గౌడ్, ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకులు మహాదేవప్ప, నలంద మహానందయ్య, కాశీం వలి, పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కామన్‌దొడ్డిలో కార్డన్ సెర్చ్


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ హనుమంతరెడ్డి

కోసిగి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన కామన్‌దొడ్డి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో పోలీసులు గ్రామంలోకి రావడంతో గ్రామంలో ఏదో జరిగిందని అప్పుడప్పుడే నిద్ర లేస్తున్న గ్రామస్థులు భయాందోళనలన చెందారు. అయితే.. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ప్యాక్షన్ గ్రామం కామన్‌దొడ్డిలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. గ్రామంలోని రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులు, నేరచరిత్ర వ్యక్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని బసవేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామంలో గొడవలుకు తావు లేకుండా అందరూ ప్రశాంతంగా జీవించాలన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమకు సమాచారం అందించాలని వారు తెలిపారు. ట్రైనీ ఎస్ఐ ఈశ్వరరావు, ఏఎస్ఐ తిరుపాల్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున పాల్గొన్నారు.

నిఘా నీడలో మంత్రాలయం


సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న పోలీసులు, శ్రీమఠం సిబ్బంది

మంత్రాలయం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు, చోరీలు, మోసాలు అల్లర్లు జరగకుండా ఉండేందుకు మంత్రాలయంలో దాదాపు 700 కెమెరాల నిఘా మధ్య పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి ఎంఎన్ భార్గవి, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, పోలీసులు రంగస్వామి, ఆంజనేయులు, లలిత, శ్రీమఠం సిబ్బంది శ్రీనిధి, నవీన్ కుమార్, శివరుద్రాచార్ అనుక్షణం సీసీ పుటేజీలను పరిశీలిస్తు సిబ్బంది నిర్లక్ష్యం ఉన్న ప్రాంతాల్లో హెచ్చరికలు జారీ చేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. ఉత్సవాల్లో ఏ చిన్నపాటి సంఘటనలు జరగకుండా నిత్యం గస్తి కొనసాగుతుంది. భక్తులకు శీఘ్ర దర్శనానికి పోలీసులు అందిస్తున్న సహకారాన్ని శ్రీమఠం అధికారులు, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి అభినందిస్తున్నారు.

వ్యవసాయ రుణాలను రెన్యువల్ చేసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్

గోనెగండ్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి):రైతులు వ్యవసాయ రుణాలను సకాలంలో రెన్యుల్ చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సరేష్ బాబు, ఫీల్డ్‌ఆఫీసర్ మధు, మనోహర్ కోరారు. ఆదివారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని రైతులతో మట్లాడారు. రైతులకు బ్యాంక్ కల్పిస్తున్న రుణసౌకర్యాలను వివరించారు. అనంతరం గ్రామంలో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతుల ఇండ్లకు వెళ్లి వ్యవసాయ రుణాలను రెన్యువల్ చేసుకోవాలని, దీని వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే మొండి బకాయిదారులకు ఓటీఎస్(వన్‌టైమ్ సెటిల్‌మెంట్)పద్ధతి ద్వారా వీలైనంత త్వరగా ఈ నెల ఆఖరులోపు సెటిల్ చేసుకోవాలని కోరారు. అలాగే పీఎంజేజేబీవై రూ. 436 లకు రూ. 2లక్షల బీమా, పీఎంకే ఎస్బీవై రూ. 20 లకు రూ. 2లక్షల బీమా, సౌకర్యం చేసుకోవాలని కోరారు. అలాగే ప్రమాద బీమా ఒక్క ఏడాదికి రూ.2000లకు రూ. 40లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. రోడ్డుప్రమాదం, కరెంట్‌షాక్, వరదలు, భూకంపాలు, పాముకాటు, తేలుకాటు లాంటివి సంభవిస్తే నామినికి రూ. 40లక్షలు బీమా సొమ్ము అందుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మినీ బ్యాంక్ బీసీలు అక్బర్, సిబ్బంది సద్దాం, ఉమర్, శంకర్ పాల్గొన్నారు.

మార్కండేయ స్వామికి ఊంజల్ సేవ


ఊంజల్ సేవ నిర్వహిస్తున్న పద్మశాలీయులు

కోసిగి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో వెలసిన పద్మశాలీయుల కులబాంధవుల ఆరాధ్య దైవమైన భక్త మార్కండేయస్వామికి విశేష పూజలు చేశారు. ఆదివారం శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆలయ అర్చకులు వీరేష్ స్వామి, వేద పండితులు ఆదోనికి చెందిన వెంకటేశ్ శాస్త్రి, రామచంద్రశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. తుంగభద్ర జలాలతో అభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, వెండి కవచ అలంకరణ, మహా మంగళహారతులు విశేష పూజలు చేపట్టారు. ఆలయంలో గోమాత పూజ, గణపతి, నవగ్రహ పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పద్మశాలీయులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. నేడు సంప్రదాయబద్ధంగా వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.